# ''ఆలంబన''

## – పి.ఎం.సుందరరావు

''పోవే! మూడుముళ్ళు వేయించుకుని, మొగుడుచేయి పట్టుకుని గడపదాటిన తర్వాత పెట్టా, బేడా సర్దుకుని వస్తే, స్వాగతం పలకటానికి నీ తల్లిదండ్రులు సిగ్గు, లజ్జలేనోళ్ళుకాదు. నీ అన్నదమ్ములు వెధవలుకాదు. పోతే, మళ్ళీ నాదగ్గరకొచ్చి, నా కాళ్ళమీద పడకతప్పదు. అప్పుడు చెబుతా నీసంగతి'' అని తన భర్త అన్నమాటలు పదే పదే చెవిలో మారుమోగసాగాయి.

అంతేకాదు–

''చావైనా బతుకైనా భర్తనీడలో ఉండటం మంచిదమ్మా. భర్తనొదిలేసిన దానికి సమాజంలో గౌరవం ఉండదమ్మా!''

''ఎంత ప్రేమగల తల్లిదండ్రులైనా పెళ్ళయిన తర్వాత భరించటానికి ఇష్టపడరు. కాబట్టి చావో, బ్రతుకో భర్త దగ్గరుండటం మంచిదమ్మా.''

''భార్య భర్తను వదిలేసినా, భర్త భార్యను వదిలేసినా భార్యదే తప్పుగా భావిస్తారు. నాలుగు మాటలన్నా, రెండు దెబ్బలు కొట్టినా మెట్టినింటి గడపదాటకూడదమ్మా.''

''భర్తను వదిలివచ్చిన వారిని తల్లిదండ్రులు నాలుగు చీవాట్లు పెట్టిగాని, మంచి మాటలు చెప్పిగాని పంపిస్తారు. అంతేగాని ఇంట్లో ఉంచుకోరు. మళ్ళీ తిరిగొస్తే మగాళ్ళకు మరీలోకువ. అందుకే అసలు పుట్టింటికి వెళ్ళకుండా ఉండటం మంచిదమ్మా'' అని నలుగురు నాలుగు మాటలన్నారు ఇరుగు పొరుగు ఆడవాళ్ళు.

అయినా వినలేదు శ్రావణి. వినకుండా తన బట్టలు సర్దుకుని బయలుదేరుతుంటే, అందరూ తప్పుబట్టారు. అదే శ్రావణికి అర్థంకానిది.

తనగోడు చెబుతుంటే వినలేదు. కొంతమంది విన్నా పట్టించుకోకుండా మగాడు ఎన్నిమాటలన్నా పడుండాలన్నారు. ఆడదై పుట్టిన తర్వాత సహించాలన్నారు. మరీ కొందరైతే భర్తకు అనే హక్కు, భార్యకు భరించాల్సిన అవసరం ఉందని తేల్చి చెప్పారు. కొంతమంది సీత, సావిత్రి, అనసూయమ్మలను ఆదర్శంగా తీసుకోమని చెప్పారు.

అంతేగాని తనను గురించి ఎవరూ జాలిపడలేదు. అదే ఆశ్చర్యమనిపించింది శ్రావణికి.

తన భర్త కిశోర్‌ను తలచుకుంటేనే అసహ్యం వేసింది. ఇప్పటిదాకా ఎన్నిమాటలన్నా పడుంది. ఎంత కొట్టినా సహించింది. కానీ నిన్న అన్నమాటలు తలచుకుంటేనే ఒళ్ళంతా కంపరమెత్తుతుంది. ఆ కోరిక వింటేనే భర్తనేవాడిమీద అసహ్యం వేసింది.

అందుకే శ్రావణి పుట్టింటికి బయలుదేరింది.

అంతలోనే మరో అనుమానం వచ్చింది.

''నువ్వు ఇక్కడ ఉండటానికి వీల్లేదు. అక్కడే చావుపో'' అని బయటకు గెంటివేస్తే.

ఛ, అలా ఎన్నటికీ జరగదని, తన మనసుకు సర్ధిచెప్పుకుంది.

ఇంతలో ఆ ఊరు రావటంతో సూట్‌కేసుతో బస్సు దిగి, ఇంటికి బయలుదేరింది.

''అవును. మీవారు లేకుండా ఒక్కదానివే వస్తున్నావేంటి శ్రావణి.''

''ఇంకా పండగ నెలరోజులుంటే అప్పుడే వస్తున్నావు. ఇన్నిరోజులూ పుట్టింట్లో తిష్టవేయటానికేనా!''

''నీవాలకం చూస్తుంటే అలిగి వస్తున్నట్టుంది. అప్పుడే సంసారం సత్తుబండలైందా ఏంటి?''

అని తెలిసిన వారందరూ పలకరిస్తున్నా, ఎవరిమాటలకు ఏ సమాధానం చెప్పకుండానే ముకవళికలతో బాగున్నారా– అంటూ ఇంట్లోకి వచ్చిపడింది శ్రావణి.

తల్లి యశోధమ్మ కూతురు చేతిలోని సూట్‌కేసును తీసుకుని వరండాగేటువైపు చూస్తూ ''ఇద్దరూ కలిసి రాలేదమ్మా'' అంటుంటే, కళ్ళవెంట నీళ్ళు కార్చటం తప్ప ఏం చెప్పలేకపోయింది. కూతురు ముఖాన్ని గమనించి, ఏం జరిగిందోననే ఆశ్చర్యం, భయంతో భర్తవైపు చూసింది.

తొందరపడమాక అన్నట్లు చూసి, గోడకు అటు తిరిగి నిలబడి ఉన్న శ్రావణి దగ్గరకెళ్ళి, తలమీద చేయివేసి మెల్లగా నిమిరాడు రాఘవరావు.

చల్లని చేతి స్పర్శకు పులకించిపోయి, కళ్ళు తుడుచుకుని తండ్రివైపు తిరిగింది శ్రావణి.

''ఏంటమ్మా! ఒక్కదానివే వచ్చావు'' అని నెమ్మదిగా అడిగిన తండ్రి మాటలకు, శ్రావణి చెప్పిన సమాధానం విని, తల్లిదండ్రులిద్దరూ నివ్వెరపోయారు.

రెండడుగులు వేసి మడతకుర్చీలో కూలబడిపోయాడు రాఘవరావు. యశోదరమ్మ నోట్లో గుడ్డకుక్కుకుని శబ్ధం రాకుండా ఏడవటం మొదలుపెట్టింది. తల్లిదండ్రుల పరిస్థితిని చూసేసరికి శ్రావణికి మళ్ళీ దుఃఖం ప్రారంభమైంది.

అదంతా విన్న శంకరం లోపల గదిలో నుంచి వస్తూ ''ఆ గొంతు వినగానే అనుకున్నాను ఈ మహాతల్లి ఏదో ఘనకార్యం చేసి వస్తుందని. దేవుడులాంటి బావగారు దీన్ని ఇంట్లోనుంచి పంపించారంటే, ఇదే, ఏదో తప్పు చేసుంటుంది'' అని ఇంటికప్పు అదిరేలా అరుస్తూ, కోపంగా చూశాడు శ్రావణివైపు.

''ఇంటికి పెద్దవాడివైయుండి ఓదార్చి నెమ్మదిగా విషయం కనుక్కోవాలిగాని, ఇలాగేనా మాట్లాడేది'' అని కొడుకుని మందలించింది యశోదరమ్మ.

''ఎవరు ఎలాపోతే మీకెందుకండీ. చూస్తూ ఊరుకోరుగదా!'' అంది శంకరం భార్య జయంతి. ఆ మాటల్లో శ్రావణి విషయం మాకేం పట్టదనే విషయం స్పష్టంగా గోచరించింది.

ట్యూషన్ నుంచి వచ్చిన రమేష్ అక్క శ్రావణిని, ఇంట్లో వాతావరణాన్ని చూసి, తనకేం పట్టనట్టు చేతిలోని బుక్స్ సరిచేసుకుంటూ, తన గదిలోకి వెళ్ళిపోయాడు.

''ఈ సమస్య క్షణాల్లో తేల్చేదికాదని అర్థంచేసుకున్న రాఘవరావు అక్కడ జరిగిన విషయం మనకు తెలియదు. జరిగిన నిజమేంటో తెలుసుకున్న తర్వాత, చేయాల్సిందేదో అప్పుడు ఆలోచిద్దాం'' అనేసరికి అక్కడి నుంచి వెళ్ళిపోయారు పెద్దకొడుకు శంకరం, జయంతి.

''ముందు స్నానం చేసి, భోజనం చెయ్యమ్మా. నేను బజారుదాకా వెళ్ళొస్తాను'' అని ఇంట్లోనుంచి వీధిలోకి వచ్చాడు.

• • •

ఎనిమిది గంటలు కావస్తూండటంతో, ఆతృతగా భర్త కిశోర్ కోసం ఎదురుచూస్తూ వాకిట్లోనే నిలబడింది శ్రావణి. కాసేపటికి సందు మలుపులో, వీధి లైటు వెలుగులో వస్తూ కనిపించిన కిశోర్‌ను చూసేసరికి ఆనందం రెట్టింపు అయ్యింది. కిశోర్ దగ్గరకు రాగానే నవ్వురూపంలో వెలిబుచ్చింది.

శ్రావణి నవ్వును చూసి కిశోర్ ''ఏంటే, ఎవరికోసం వాకిట్లో, రెడ్‌లైట్ ఏరియాలో సానిదానిలా నవ్వుతూ నిల్చున్నావు.'' అనేసరికి, శ్రావణికి నవనాడులు కృంగిపోయాయి. అంతే, ఒక్క ఉదుటున ఇంట్లోకొచ్చి మంచం మీద పడి భోరున ఏడవసాగింది.

సూటి పోటి మాటలు వినటం శ్రావణికి కొత్తకాదు. అది గత రెండు నెలలుగా అనుభవిస్తూనే ఉంది. కానీ, ఈరోజు అన్నమాటలు తన గుండెను శూలాలై చీల్చుతుంటే, తల మంచం పట్టెకేసి కొట్టుకుని ఏడవసాగింది.

ముందుగదిలో కూర్చుని ''టీ తీసుకురావే'' అని కేకపెట్టాడు.

అది విని ఇవ్వటానికి మనస్కరించకపోయినా, ఇవ్వకపోతే ఇంకెలాంటి మాటలు వినాల్సి వస్తుందోనని, వెంటనే లేచి వంటగదిలోకెళ్ళి టీ కప్పుతో హాల్లోకి వచ్చి ''తీసుకోండి'' అంది. ''కళ్ళు కనిపించటంలేదా. కళ్ళు నెత్తికెక్కాయా! ఇవతల ఓ మనిషి ఉన్నాడనే విషయం తెలియటంలేదా. వారికి ఇవ్వాలన్న జ్ఞానంలేదా. అలా గుడ్లప్పగించి చూడకుండా. ఇంకో టీ తీసుకురా.'' అని కోపంగా అనేసరికి, కిక్కురుమనకుండా వంటగదిలోకెళ్ళి, క్షణంలో మరోకప్పు తీసుకొచ్చి ఇచ్చింది.

దుఃఖాన్ని, వస్తున్న ఆవేశాన్ని లోలోపలే అణచుకుంది. లేకుంటే పరాయివారి ముందు. తను ఇంకా పరాభవం కాక తప్పదు.

శ్రావణి దుఃఖాన్ని, ముఖాన్ని గమనించి ''ఏంటి కిశోర్, దేవతలా ఉన్న ఇలాంటి ఇల్లాలిని పట్టుకుని, అంతంత మాటలనటం ఏం బాగులేదు'' అన్నాడు ఆమిత్రుడు.



కిశోర్ తన మిత్రుడితో ఉన్న పరిచయంవలన అతనిని ఏమీ అనలేక ఖాళీ అయిన కప్పును ఎదురుగా ఉన్న టీపాయ్ మీద పెట్టి ''ఒరే! బంగారానికైనా సమ్మెట దెబ్బ పడనిదే ఆభరణాలుగా వంగదు. ఈ ఆడంగులూ అంతే.'' అన్నాడు నిర్మొహమాటంగా.

ఆమాటలకు స్త్రీలమీద కిశోర్‌కి ఎలాంటి అభిప్రాయం ఉందో అర్థమైంది శ్రావణికి.

లోపలిగదిలోకి వచ్చి మంచంమీద పడుకుంది. ఎంత గుర్తుచేసుకోకుండా ఉందామన్నా కిశోర్ అన్న మాటలు, పదే పదే గుర్తుకొచ్చి కుమిలిపోసాగింది.

ఆమాటలు అనటానికి కారణం తను పుట్టింటి నుంచి అడిగినంత డబ్బు తీసుకురాలేదని కిశోర్ వాదన.

ఒప్పుకున్నంత కట్నం పెళ్ళినాడే ఇచ్చారు. మర్యాదలన్నీ ఘనంగా చేసారు. ఇంకా అడిగినప్పుడల్లా డబ్బులివ్వటానికి, తన తల్లిదండ్రులు ధనవంతులు కాదనేది శ్రావణి అభ్యర్థన.

ఓరోజు కిశోర్ ''శ్రావణీ! బయట అప్పులోళ్ళ గొడవ ఎక్కువగా ఉంది. ఆఫీసుకు వెళ్ళటానికే భయంగా ఉంది. ప్రస్తుతం గొంతుమీద కూర్చున్న వాళ్ళకు పదివేలు సర్దితే, కొన్నాళ్ళదాకా ఫరవాలేదు. మీవాళ్ళ పరిస్థితి నాకు తెలుసు. అంత డబ్బును వాళ్ళనడగటం భావ్యం కూడా కాదు. కానీ ఈ గండం నుంచి బయటపడటం మాత్రం నీచేతిలోనే ఉంది'' అని ఆగిపోయాడు.

పదివేలు తీసుకురావటం తన చేతుల్లో ఉండటం, ఏమిటో అర్థంగాక అదేవిషయం అడిగింది–

కిశోర్ కాసేపు చెప్పటానికి నీళ్ళు నమిలి ''శ్రావణీ, తప్పనిసరి పరిస్థితిలో ఈపని చేయాల్సి వస్తుంది. ఇది నీకు కొంచెం తప్పుగా అనిపించొచ్చుగాని, కొన్ని ఉన్నత తరగతి కుటుంబాలలో ఇది మామూలే. అందుకని...''


విషయం అర్థంగాక ''ఏం చేయాలో అర్థమయ్యేటట్టు చెప్పండి'' అని శ్రావణి అనటంతో–

''ఏంలేదు శ్రావణీ. సంపత్ అని ఓ వ్యాపారస్తుడు ఉన్నాడు. ఇవాళా రేపూ అతనికి కంపెనీ ఇచ్చావంటే ఆపదివేలు బాకీ తీర్చవచ్చు'' అని విషయాన్ని గబగబా చెప్పేశాడు.

ఆమాట వినగానే ఒక్కసారి ఏమీ అర్థంకాలేదు శ్రావణికి. అర్థంకాగానే కాళ్ళకింద భూమి కదిలి, అందులో కూరుకుపోతున్నట్టనిపించింది.

ఇంకా నీ సమాధానమేంటన్నట్టు చూస్తున్న కిశోర్‌కేసి ఒక్క చూపు చూసింది. ఆ చూపుకే శక్తి ఉంటే కిశోర్ అక్కడికక్కడే దహించుకుపోయి పిడికెడు బూడిదగా మారిపోయి ఉండేవాడు.

శ్రావణి ముఖాన్ని చూసి అర్థంచేసుకుని కోపంతో ఊగిపోతూ, ''ఏంటే, పెద్ద పతివ్రతలా ఫోజు ఇస్తున్నావు. నీ తల్లిదండ్రులనుంచి డబ్బు తీసుకురాలేవు. ఈపనికి ఒప్పుకోవు. డబ్బులెక్కడి నుంచి వస్తాయే''



## వెళ్ళేదారి

''ఒకవేళ నేను చనిపోతే ప్రతిరోజు నా సమాధివద్దకి వచ్చి నా సమాధిని చూస్తావా?'' అడిగాడు ఆనంద్.

''తప్పకుండా డార్లింగ్. ఎందుకంటే ప్రతిరోజు నేను వెళ్ళే లేడీస్ క్లబ్‌కి శ్మశానం ప్రక్కనుంచే వెళ్ళాలి!'' అంది భవాని.

## వయసు

''ప్రముఖ హీరోయిన్ కమల నీకు తెలుసా?'' అడిగింది బిందు.

''ఎందుకు తెలియదు. చిన్నప్పుడు మేమిద్దరం సమాన వయస్కులం. పక్క పక్క వాటాలలోనే వుండేవాళ్ళం. కాని...''

''కాని ఏమిటే?''


''ఇప్పుడు నా వయస్సు 35 సంవత్సరాలు కాని ఆవిడ వయస్సు 18 సంవత్సరాలే!'' చెప్పింది మాధవి.

## ప్రసవం

''అయ్యిందా.. ప్రసవమయ్యిందా... ఇంకా నొప్పులు పడుతునేవుందా... చెప్పండి.. భయంతో చచ్చిపోయేలా వున్నాను!'' అడిగాడు వంశీ ఆసుపత్రి గదిలోనుంచి వస్తున్న నర్స్ చేతులని గట్టిగా పట్టుకుని.

''ఊరుకోండి... నేను ఇప్పటికి రెండువేల పురుళ్ళు పోసాను. భార్య నొప్పులకి భర్త చనిపోవడం నేనెక్కడ చూడలేదు'' విసుగ్గా అంది నర్స్.

- పి.వి. మురళీకృష్ణ (హైద్రాబాద్)




అన్నాడు కిశోర్.

''ఒరే, నీ జీతం డబ్బులు తాగుడికి, జూదానికి తగలేస్తున్నావు. అదీ చాలక అప్పులు చేసావు. ఇప్పుడీ పనికి పాల్పడుతున్నావంటే, నువ్వసలు నా భర్తవేనా?'' అని కోపంగా అడిగింది ఎన్నడూ నోరు తెరవని శ్రావణి.

శ్రావణి అలా మాట్లాడినందుకు, తనమాట కాదన్నందుకు కోపంతో రెచ్చిపోయిన కిశోర్, చాచి చెంపమీద కొట్టాడు.

అది సహించలేని శ్రావణి, తిరిగి చూచి చెంపమీద కొట్టి, ''చావనైనా ఛస్తాగాని, నీదగ్గర ఒక్కక్షణం కూడా ఉండను.'' అని వచ్చేసింది.

• • •

''భర్తనేవాడు గుండెల్లో పెట్టుకుని చూసుకోవాలి. నీ భర్త మాత్రం మరొకరి పక్కలోకి వెళ్ళమంటున్నాడు. అలాంటివాడి దగ్గర పడిచావమని ఎవరూ చెప్పరు శ్రావణీ. ఆడపిల్లకి పెళ్ళిచేసి చేతులు దులుపుకోవటంతో తల్లిదండ్రుల బాధ్యత తీరిపోదు. భర్త అసమర్థుడైనప్పుడు తిరిగి ఆసరా కూడా కల్పించాలి. అదీ బాధ్యత.''

రాఘవరావు ప్రాణస్నేహితుడైన కుటుంబరావు ఆ మాటలు అనేసరికి శ్రావణికి ధైర్యం వచ్చి కళ్ళు తుడుచుకుంది ఏడుపును ఆపుకుంటూ.

నీ అభిప్రాయం ఏంటన్నట్టుగా రాఘవరావుకేసి చూశాడు కుటుంబరావు. ఏం చెప్పలేక మౌనంగా తలదించుకున్నాడు రాఘవరావు. భర్త అడుగుజాడల్లో నడిచే యశోదమ్మ ఏడవటం తప్ప, ఏం చేయలేక అలాగే నిల్చుండిపోయింది.

పరిస్థితిని, రేపటి స్థితిని అర్థం చేసుకున్న శంకరం, ''పెళ్ళిచేసి మెట్టినింటికి పంపించిన పిల్ల తిరిగివస్తే నయానో, భయానో చెప్పి పంపించాలిగాని, ఇంట్లో పెట్టుకోకూడదు. అలా చేస్తే ఆయనేం తండ్రి, వాడేం అన్న. అని నలుగురు నానా మాటలు అంటారు. రేపు వెళ్ళి శ్రావణిని వదిలిపెట్టి రండి.''

తండ్రికి ఆజ్ఞ ఇచ్చి శ్రావణివైపు 'ఈదరిద్రం ఎప్పుడు వదులుతుందా' అన్నట్టు చూసి బయటకు వెళ్ళిపోయాడు. చిన్నకొడుకు రమేష్ కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసాడు.

కన్నవారు, తోడబుట్టినవారు చూపిన నిర్లక్ష్యానికి శ్రావణికి నోటివెంట మాట రాకుండా కళ్ళనుండి నీరు ఉబుకసాగింది.

రాఘవరావు ఆలోచనలో పడ్డాడు. కాసేపు మౌనం అక్కడ రాజ్యం ఏలింది.

ఆ మౌనాన్ని చీలుస్తూ ''ఏంటిరా!'' అన్నాడు కుటుంబరావు.

''ఒరే, కొడుకులు రెక్కలొచ్చి అమెరికా వెళ్ళిపోయినా, వచ్చే పెన్షన్ డబ్బులతో హాయిగా బతుకుతున్న నీలాంటి పరిస్థితి కాదురా- నాది. మేము కొడుకుల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడ్డవాళ్ళం. కాబట్టి వాళ్ళ మాటే నామాట. ఇప్పుడే వెళ్ళి దానిని అల్లుడి దగ్గర దిగబెట్టి వస్తాను.''

తండ్రి నిర్ణయాన్ని వినేసరికి శ్రావణికి మతిపోయింది. చివరకు కన్నతండ్రి కూడా అలాంటి నిర్ణయం తీసుకున్నప్పుడు, ఇక అక్కడ ఒక్కక్షణం కూడా ఉండకూడదనుకుంది. శ్రావణి ముఖకవళికలను గమనించిన కుటుంబరావు 'ఊరుకోమ్మా' అన్నట్లు తలమీద చెయ్యివేసి మెల్లగా నిమిరాడు.

• • •

''ఛీ! ఈ వయసులో వీడికి ఇదేం బుద్ధి. అయినా దానికి ఉండొద్దు సిగ్గు. కాటికి చేరువవుతున్న సమయంలో కుర్రపిల్లని వెంటపెట్టుకుని తిరుగుతున్నాడు.''

''ముసలోడైనా బాగా డబ్బుంది. అది చాలు దానికి.''

''దానినేమో మొగుడొదిలేశాడు. వీడిని పిల్లలు దరి చేరనీయలేదు. ఇద్దరికీ జోడీ బాగా కుదిరింది.''

''ఆ! ఈ ముసలోడి దగ్గర ఎన్నాళ్ళుంటుందిలే. ఎవడో కుర్రాడితో లేచిపోద్ది. అప్పుడు ఈ ముసలోడి గతి ఏంటో!''

అని నలుగురు నాలుగు రకాలుగా అనుకుంటున్న మాటలను కుటుంబరావు, శ్రావణి లెక్కచేయలేదు.

దాదాపు రెండువేలు పెన్షన్ వస్తున్నా కుటుంబరావుకు చేతులు కాల్చుకోక తప్పలేదు. ఏ సుస్తీచేసినా కనీసం కాఫీపెట్టి, ఓ టాబ్లెట్ ఇచ్చేదిక్కులేదు. ఈరోజున ఆ అవసరాలన్నీ శ్రావణి తీరుస్తుంది. కన్నవాళ్ళు, తోడబుట్టినవాళ్ళు, కట్టుకున్నవాడు నిరాదరించినవేళ, పెద్దమనసుతో ఆశ్రయమిచ్చాడు.

టెన్త్‌తో ఆపిన చదువును, కుటుంబరావు కోరికమీద శ్రావణి ఓపెన్ యూనివర్శిటీ ద్వారా డిగ్రీ చేస్తుంది. శ్రావణిని బాగా చదివించి పెద్ద ఉద్యోగస్థురాలిగా చూడాలనేది ఆయన కోరిక. కుటుంబరావు చివరిదశలో ఏకష్టం లేకుండా జీవనయాత్రను సాగించేందుకు సహకరించాలనేది శ్రావణి కోరిక.

అందుకే ఇద్దరూ ఎవరు ఏమనుకుంటున్నా ఒకే ఇంటిలో జీవనం సాగిస్తున్నారు. దానికి కాకులైన లోకులు అనేక రకాల పేర్లు పెట్టుకున్నారు. అయినా కుటుంబరావుగాని, శ్రావణిగాని వాటినేమీ పట్టించుకోలేదు. ఎందుకంటే వారికి, వారి జీవనం ముఖ్యం. ఒకరితోడు మరొకరికి అవసరం. ఒకరికొకరు ఆలంబన.

★